

త్వరలో నూతన భవనాలు ప్రారంభం

కాణిపాకం వినాయకుడి ఆలయంలో త్వరలోనే నూతన భవనాలను ప్రారంభించినున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. - 8లో



కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లాలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించి జిల్లాకేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. - 8లో



హుండీ కానుకల లెక్కింపు

బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ కానుకలను గురువారం లెక్కించినట్లు ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఈవీఎంలకు పటిష్ట భద్రత



ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద పకడ్బందీగా భద్రత ఏర్పాటు చేశామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఉన్న ఎన్నికల గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గోడౌన్ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. పోలీస్, 24 గంటల సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఈవీఎంలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు సదుం విద్యార్థి



విద్యార్థి ధరణీధర్‌ను అభినందిస్తున్న టీచర్లు

సదుం: జాతీయస్థాయి పోటీలకు సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ధరణీధర్ ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్రమణ్యం గురువారం తెలిపారు. చిత్తూరులో జరిగిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి ధరణీధర్ ప్రతిభ చూపాడన్నారు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. గుజరాత్‌లో జరిగే పోటీల్లో తమ విద్యార్థి ధరణీధర్ పాల్గొంటాడని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు కిశోర్‌కుమార్, రెడ్డిప్రవీణ పాల్గొన్నారు.

జిల్లా రవాణాశాఖలో ఏసీబీ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

చిత్తూరు రూరల్: జిల్లాకేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ఏసీబీ సీఐ రవీంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, ఇతర శాఖలకు చెందిన వివి విజయభాస్కర్, ఉదయ్‌కుమార్ స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విచారణ చేపట్టారు. ఓ గదిని మాత్రం తాళం తీయకూడదని వారు ముందుగానే ఆ శాఖ అధికారులకు సూచించారు. ఏసీబీ అధికారులు కార్యాలయానికి చేరుకున్న తర్వాత ఆ గది తాళం తెరిచి బీరువా, ఇతరత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో నగదు, విలువైన పత్రాలు ఏవైనా ఉన్నాయా ? అనే కోణంలో చూశారు. ఈ తనిఖీలు మొత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంవీఐగా పనిచేస్తున్న మధుసూదన్‌కు సంబంధించినవని, అతని పాత కేసులపై ఆరా తీసినట్లు తెలిసింది. కాగా ఏసీబీ అధికారులు మీడియాకు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. తిరుపతిలో సమావేశం నిర్వహించి తనిఖీలకు సంబంధించిన వివరాలను చెబుతామన్నారు.

నేడు జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం ఈ నెల 29న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు, సఫాయి కర్మచారి చట్టం అమలుపై పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ కమిటీ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

నవశకం

మాజీ సీఎం చంద్రబాబు పాలనలో ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ విద్యావ్యవస్థకు రెడ్ కార్పెట్ వేసి ప్రోత్సహించారు. నాడు ప్రభుత్వ స్కూళ్లలో కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. కానీ నాలుగున్నరేళ్ల కిందట ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేశారు. పేదవాడికి సైతం ఉన్నత చదువులను దగ్గర చేశారు. కార్పొరేట్‌లను తలదన్నేలా స్కూళ్లను తీర్చిదిద్దారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థపై తల్లిదండ్రులకు గట్టి భరోసాను కల్పించారు.

- విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేసిన వైఎస్ జగన్ సర్కారు
- మౌలిక నదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం
- కార్పొరేట్ విద్యావ్యవస్థలను తలదన్నేలా ప్రభుత్వ స్కూళ్లలో విద్య
- సాంకేతికను పెంపొందిస్తూ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



నాడు-నేడు ద్వారా రూపురేఖలు మారిన గంగవరం హైస్కూల్ పాఠశాల

నాడు శిథిలం.. నేడు సుందరం

పలమనేరు: గత టీడీపీ సర్కారు పాలనలో ప్రభుత్వ పాఠశాలలంటే ప్రజల్లో ఓ చులకన భావం కనిపించేది. దీనికి తోడు నాటి పాలకులు సైతం కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముగాసి సర్కారు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వ స్కూళ్లను గాలికొదిలేశారు. ఫలితంగా స్కూళ్లలో కనీస వసతులు లేక పేద విద్యార్థుల చదువులు గాలిలో దీపంలా మారాయి. కూలినాలి చేసుకునే వారు సైతం తమ పిల్లలను ప్రైవేటు మీడియం స్కూళ్లకే పంపాల్సిన దుస్థితని కల్పించింది నాటి చంద్రబాబు ప్రభుత్వం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం జగన్ విద్యకు పెద్దపీట వేశారు. మనబడి నాడునేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన భోజనం, ఫ్యాన్లు, కలర్ డెస్కులు, లైట్లు, చక్కటి వాల్‌పెయింటింగ్స్, గ్రీన్ చాక్‌బోర్డులు, స్మార్ట్‌టీవీలు, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్లాట్‌ప్లానల్స్, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించి తల్లిదండ్రులకు సర్కారు స్కూళ్లపై నమ్మకం కలిగించారు. కార్పొరేట్‌ను తలదన్నేలా స్కూల్ భవనాలు, విద్యార్థులకు యూనిఫాం, తల్లులకు అమ్మఒడి ఇలా ఎన్నో విప్లవాత్మక మార్పులు చేశారు. దీంతో గ్రామాల్లోని పాఠశాలలను చూసి గ్రామస్తులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు కూడా తాము ప్రభుత్వ బడిలోనే చదువుకుంటామని ధైర్యంగా చెబుతున్నారు.

జగనన్న విద్యాకానుక ఇలా..

జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు ఓ సెట్, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు, ఇంగ్లిష్ టు తెలుగు నిఘంటువు, స్కూల్ బ్యాగు, మూడు జతల యూనిఫాం, షూలు, రెండు జతల సాక్సులు, బెల్టు ఉంటుంది. యూనిఫాం కుట్టుకూలీగా 1 నుంచి 8 తరగతులకు రూ.120, అలాగే 9, 10 తరగతులకు రూ.250గా అందించారు.

పలమనేరు నియోజకవర్గంలోని స్కూళ్ల సమాచారం

మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 469(ప్రైమరీ, యూపీ, హైస్కూళ్లు)
మొదటి విడతలో నాడు-నేడు కింద ఎంపికైన స్కూళ్లు : 123
ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.32.87 కోట్లు
రెండో విడతలో ఎంపికైన స్కూళ్లు : 230
ఖర్చు చేయనున్న మొత్తం రూ.62 కోట్లు
విద్యార్థుల సంఖ్య: 48,200
మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య:1620
ఈ విద్యాసంవత్సరంలో పెరిగిన అడ్మిషన్ల సంఖ్య: 3 వేలు
నియోజకవర్గంలో పంపిణీ చేసిన జేవీకే కిట్లు 51 వేలు

మా పిల్లల చదువుకు ఏ ఇబ్బంది లేదు..



ఈ ప్రభుత్వంలో బడులు చక్కగా మారాయి. గతంలో చెట్ల కింద పాఠాలు, అరకొర సౌకర్యాలు ఉండేవి. ఇప్పుడు అవి ఏవీ కనిపించవు. నా ఇద్దరి పిల్లలను సంతోషంగా సర్కారు బడికి పంపుతున్నా. మా కష్టాలన్నీ పిల్లల భవిష్యత్తు కోసమే కదా. ఇన్ని సౌకర్యాలు ప్రభుత్వ స్కూల్లోనే కల్పిస్తుండడంతో ఇక మాకు ఏం ఇబ్బందులు లేవు.
– పావని, ముత్తుకూరు, పెద్దపంజాణి మండలం

నా బడి అనుకుని సొంత నిధులు పెట్టా..



పలమనేరు మండలం లోని నూనేవారిపల్లి ప్రాథమిక పాఠశాల గతంలో కూలేందుకు సిద్ధంగా ఉండేది. నాడు-నేడు ద్వారా స్కూల్ రూపురేఖలు మారిపోయాయి. మాకు మంజూరైన నిధులు చాలకుంటే నేను గ్రామపెద్దల సహకారంతో కాంపౌండ్ వాల్ కోసం సొంత నిధులు వెచ్చించా. నా బడి, నా పిల్లలనే భావన కలిగి సొంత డబ్బు ఖర్చు చేశా. స్కూళ్ల బాగు కోసం ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. – పుష్పావతి(గతంలో ఇక్కడ పనిచేసిన టీచర్), నూనేవారిపల్లి

ఇష్టంగా వెళుతున్నారు



నా ముగ్గురు పిల్లలు మా గ్రామంలోని సర్కారు బడికి వెళ్తున్నారు. అసలు మన ఊరి స్కూలేనా ఇది అనిపిస్తుంది అక్కడికి వెళ్లి చూస్తే. పిల్లలకు కావాల్సిన విద్యాసామగ్రి ఉచితంగా ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం మా ఇంటికంటే బాగుంటుంది. మంచి యూనిఫాం వేసుకొని మా బిడ్డలు మా ఊర్లో స్కూల్‌కు ఎంతో ఇష్టంగా వెళ్తున్నారు.
– కస్తూరి, భారత్‌నగర్, వీకోట

ఇబ్బంది లేకుండా చేశారు



నా ఇద్దరు పిల్లలు కూడా ప్రభుత్వ బడికే వెళ్తున్నారు. మా గ్రామంలోని స్కూల్ అందంగా మారింది. ఇంతకు ముందు వర్షం పడితే పిల్లలను ఇంటికి పంపేంచేవారు. ఇప్పుడు భవనాలు బాగా కట్టారు. తాగేందుకు మంచినీరు, మంచి భోజనం, కుర్చీలు అన్ని సౌకర్యాలు కల్పించారు. అందుకే పిల్లల చదువుకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా పోయింది.
– సునీత, వెంగంవారిపల్లి, బైరెడ్డిపల్లి మండలం

భవిష్యత్‌కు బాటలు వేశారు..



ఈ ప్రభుత్వం మా పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేసింది. గతంలో జూన్ నెల వచ్చిందంటే అప్పోసప్పో చేసి పిల్లలను బడికి పంపేవాళ్లం. ఇప్పుడలా కాదు. స్కూల్‌లోనే యూనిఫాం, షూలు, పుస్తకాలు, మధ్యాహ్నం మంచి భోజనం పెడుతున్నారు. కాన్వెంట్ స్కూళ్ల కంటే మా ఊరి బడే బాగుంది. నా ముగ్గురు బిడ్డలను మాఊరి స్కూల్‌లోనే చదివిస్తున్నా. – గంగాధర, కల్లుపల్లి, గంగవరం మండలం

మంచి వాతావరణం..



మాగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతంలో ఎటుచూసినా పాముల భయం ఉండేది. పిల్లలకు మరుగుదొడ్లు లేక ఆరుబయటే అంతా. నాడు-నేడు ద్వారా మా బడి బాగుపడింది. తరగతి గదుల్లో బల్లలు, మంచినీటి కోసం ఆర్వో మిషను, మూత్రశాలలు, మంచిగా వంటగది, ఆంగ్ల భోదన ఉంది. బడి వాతారవణం ఆహ్లాదకరంగా మారింది.
– చిట్టెమ్మ, కొలమాసనపల్లి, పలమనేరు మండలం



సుందరంగా మారిన కొలమాసనపల్లి స్కూల్



పలమనేరు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు



అత్యంత సుందరంగా నూనేవారిపల్లి పాఠశాల

నేడు జగనన్న విద్యాదీవెన



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకం ఈ నెల 29న ప్రారంభించనున్నారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత నిధులను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం నుంచి ప్రారంభిస్తారన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం ద్వారా మేలు కలుగుతోందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 30,111 మంది విద్యార్థులకు జనవరి నుంచి మార్చి వరకు ట్యూషన్ ఫీజు కింద రూ.18.72 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. విద్యాదీవెన నగదును అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు.

ఎస్వీయూ అభివృద్ధికి కృషి చేస్తా

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తా నని వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఎస్వీయూ పరిపాలనా భవనంలోని చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎస్వీ యూనివర్సిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వర్సిటీతో ఎన్నో ఏళ్లుగా తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ప్రొఫెసర్ స్థాయి నుంచి డీన్‌గా, ప్రిన్సిపల్‌గా, రెక్టార్‌గా పనిచేశానన్నారు. యూనివర్సిటీలో అందరినీ కలుపుకుని వర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు అందుతున్నాయని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై మరింత దృష్టి సారించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయనను ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మద్‌హుస్సేన్, పాలక మండలి సభ్యులు, వర్సిటీ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

షెడ్యూల్ ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జనవరి, ఫిబ్రవరి నెలలో చేపట్టబోయే సంక్షేమ పథకాలను పకడ్బందీగా నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జనవరి నెలలో ప్రభుత్వం నిర్వహించే వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జనవరి 1 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలకు పెంపు కార్యక్రమం ఉంటుందన్నారు. జనవరి 23 నుంచి 31వ తేదీ వరకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం, ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు వైఎస్సార్ చేయూత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా శాఖల పరిధిలో అమలయ్యే ఈ కార్యక్రమాలకు జిల్లా అధికారులు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, ఎమ్మెల్సీ భరత్, జిల్లా అధికారులు రాధమ్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్ల కల సాకారం!

- ముఖ్యమంత్రి, టీటీడీ చైర్మన్‌కు రుణపడి ఉంటాం
- టీటీడీ హౌసింగ్ సొసైటీ నాయకులు, ఉద్యోగులు
- ఆనందోత్సాహాలతో ఉద్యోగుల సందడి



ఇంటి పట్టాలు పంపిణీచేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి(అలిపిరి): 'చెప్పుడు మాటలు వినను..చెప్పిందే చేస్తాను' అంటూ టీటీడీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అడుగులేశారు. ఇళ్లపట్టాల విషయమై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ఫలితంగా టీటీడీ ఉద్యోగుల 18 ఏళ్ల కల సాకారమైంది. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈఓలు వీరబ్రహ్మం, సదాభార్గవి సహకారంతో ఉద్యోగులందరికీ పట్టాలు అందజేశారు. మహతిలో గురువారం వేడుకగా ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ వేలాది మంది ఉద్యోగులకు తన చేతుల మీదుగా ఇంటి స్థలాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. ఒక్క ఉద్యోగి కూడా నిరాశపడకూడదని, ఏడాది క్రితం ఉద్యోగంలో చేరిన వారికి పట్టా అందించాలని స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. మొదటి విడతగా వడమాలపేట వద్ద 3,518 మందికి ప్రస్తుతం పట్టాలు అందిస్తున్నామని, ఇక్కడ అవసరమైన వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎవరూ స్థలాలు అమ్ముకోరాదని, ఏడాది తిరక్కుండానే మార్కెట్ ధర ప్రకారం రూ.కోటి పలికే అవకాశం ఉందన్నారు. హౌసింగ్ సొసైటీ నాయకులు, పట్టాలు పొందిన ఉద్యోగులు తమ అభిప్రాయాలను సంతోషంగా 'సాక్షి'తో పంచుకున్నారు.

తిరుమలలో పని చేయడం అదృష్టం



తిరుమలలో పనిచేయడం అందరి అదృష్టంగా భావించాలి. టీటీడీ ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసేలా ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఇచ్చారు. టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల కోసం రూ.210 కోట్లను ఉద్యోగుల తరపున చెల్లించాం. పాగాలి వద్ద 350 ఎకరాలు త్వరలోనే స్వాధీనం చేసుకుని జనవరి చివరి నాటికి టీటీడీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ ఇంటి స్థలం ఇప్పించే ఏర్పాటు చేస్తాం. సీఎం వైఎస్ జగన్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి సహృదయంతో చేసిన కృషి వల్లే టీటీడీ ఉద్యోగులకు లబ్ధి కలిగింది.
– ఏవీ ధర్మారెడ్డి, ఈఓ, టీటీడీ దేవస్థానం

ఇన్నాళ్లకు కల నెరవేరింది



నా సంపాదన పూర్తిగా కుటుంబ ఖర్చులకు, పిల్లల చదువులకు వినియోగిస్తాం. ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇస్తారని ఎన్నో ఏళ్ల నుంచి వింటూనే ఉన్నాం. చివరికి అయితే ఒకానొక సమయంలో నిరుత్సాహ పడ్డాం. అయితే టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి కృషి ఫలితంగా నేడు నాకే కాదు. టీటీడీ ఉద్యోగులందరి కల నెరవేరుతోంది అంటే చెప్పలేనంత ఆనందంగా ఉంది. మాకు పట్టాలు అందించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.
– విజయలక్ష్మి, టీటీడీ ఉద్యోగిని, అశ్విని హాస్పిటల్

కలయా.. నిజమా



ఉద్యోగులందరికీ పట్టాలు అందిస్తుండటం ఇప్పటికీ కలయా..నిజమా అన్నట్లుంది. మా భర్త వెంకటరెడ్డి టీటీడీలోని విజిలెన్స్ విభాగంలో సుమారు 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్నారు. సొంతంగా ఇంటి స్థలం కొనాలని ఎదురుచూస్తూనే ఉన్నాం. ఇన్నాళ్లు ఇంటి స్థలం ఇస్తామని చెబుతూ వచ్చినా నేడు టీటీడీ చైర్మన్ కృషితో పట్టాలు అందడం సంతోషంగా ఉంది. స్థలముంటే చాలు ఏదోరకంగా ఇల్లు కట్టుకోవచ్చనుకుంటున్నాం. తిరుమల స్వామివారి దీవెనలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రజలకు నిరంతరం సేవలందించాలి.
– బి.సుధామణి, టీటీడీ ఉద్యోగి వెంకటరెడ్డి సతీమణి

క్లుప్తంగా

బోయకొండ హుండీ ఆదాయం రూ.46.04 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.46.04 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ.46,04,427, బంగారం 52 గ్రాములు, వెండి 480 గ్రాములు సమకూరినట్లు తెలిపారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.34,850 సమకూరిందన్నారు. 50 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ చెప్పారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం నాయుడు, పాలకమండలి సభ్యులు, ఆలయ బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ వారధులపై శకుని కుట్రలా..!

విపక్షాలకు వలంటీర్ల భయం పట్టుకుంది. నిత్యం ప్రజాసేవలో తరిస్తున్న వలంటీర్ వ్యవస్థపై ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని విషం చిమ్ముతున్నారు. వలంటీర్లు సమ్మెకు దిగుతున్నారనే తప్పుడు కథనాలు ఎల్లో మీడియాలో ప్రముఖంగా ప్రచురితమయ్యాయి. మొదట్లో వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా చిత్రీకరించే యత్నాలు చేసిన ప్రతిపక్షాలు, ఇప్పుడు ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష ప్రజాదరణ వస్తుండడాన్ని చూసి ఓర్వ లేకపోతున్నారు. వలంటీర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి లాగేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

- సంక్షేమ ప్రభుత్వానికి పునాదుల్లా నిలుస్తున్న వలంటీర్లు
- వీరి పారదర్శక సేవలకు ఇతర రాష్ట్రాల పాలకులు ఫిదా
- కోవిడ్, వరద విపత్తుల్లో ఫ్రంట్ వారియర్స్‌గా నిలిచింది వీరే..
- ప్రభుత్వానికి, ప్రజలకు సేవకులను దూరం చేయడమే లక్ష్యంగా ప్రతిపక్షాల కుయుక్తులు
- ఎల్లో మీడియా ద్వారా టీడీపీ తప్పుడు ప్రచారం

చిత్తూరు రూరల్: నిత్యం ప్రజాసేవలో తరించే వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయి. ప్రజాసంక్షేమాన్ని ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక, ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని శతవిధాలా తమ కుటిలయత్నాలు చేస్తున్నారు. వలంటీర్ సేవలకు యావత్ రాష్ట్రాల పాలకులు సైతం ఫిదా అవుతున్నారు. వారు కూడా ఏపీ ప్రభుత్వం లాగే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి కనబరిచాయి. దీంతో ప్రభుత్వానికి ప్రజల నుంచి అత్యంత ప్రజాదరణ వస్తుండడానికి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయి. ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని వలంటీర్ వ్యవస్థపై కుట్రలు పన్నుతూ, వారిని రెచ్చగొట్టే ధోరణిలో కథనాలు ప్రచురించడం మొదలు పెట్టాయి. దీనిపై యావత్ రాష్ట్ర ప్రజలు భగ్గుమంటున్నారు.

ఎనలేని సేవలు..

జిల్లావ్యాప్తంగా 612 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 9,384 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. పట్టణాల్లో 100 కుటుంబాలకు, పల్లెల్లో అయితే 50 కుటుంబాలకు ఒక వలంటీర్ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరు తమ పరిధిలోని ప్రజలకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ ఇస్తున్నారు. ఇతర పథకాలకు వారే దగ్గర ఉండి దరఖాస్తు చేయిస్తున్నారు. ఇందులో ఎక్కడా కానీ అవినీతికి అవకాశం లేదు. ఇది ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదు. అందుకే తెరచాటు నీచ రాజకీయాలకు తెరలేపాయి.

కరోనా టైంలో ఫ్రంట్ వారియర్స్‌గా..

2020లో ప్రపంచం మొత్తాన్ని కరోనా కుదిపేసింది. ఇళ్ల నుంచి జనం బయటకు రాలేని పరిస్థితులు తాండవించాయి. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా వలంటీర్లు ఫ్రంట్‌వారియర్స్‌గా నిలిచారు. ప్రభుత్వం అందించే ఆర్థికసాయం పంపిణీతో పాటు ఫీవర్ సర్వేలను పకడ్బందీగా చేపట్టారు. కోవిడ్ సమయంలో వీరి సేవలను పక్కరాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి.


పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

వలంటీర్లే టార్గెట్..

గత ఆరు నెలల కిందట ప్రజా సంక్షేమ పథకాలు అందించే వలంటీర్లపై పవన్ కల్యాణ్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆడవాళ్ల అక్రమ రవాణాలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారంటూ తప్పుడు మాటలు మాట్లాడారు. దీనిపై వలంటీర్ల వ్యవస్థ అప్పట్లో భగ్గుమంది. ప్రస్తుతం ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని విపక్షనేతలు వలంటీర్లపై తప్పుడు రాతలు రాయిస్తున్నారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండడంతో పచ్చమీడియాలో తప్పుడు కథనాలు అచ్చు వేయిస్తున్నాయి. ప్రభుత్వానికి వారధుల్లా ఉన్న వలంటీర్లకు సమ్మె చేసే ఉద్దేశం లేకపోయినా, వలంటీర్ల సమ్మె, జగన్‌పై సొంత సైన్యం యుద్ధం అంటూ తప్పుడు కథనాలు ప్రచురించాయి. ఇలాంటి కథనాలతో వలంటీర్ల మధ్య ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారు. కాగా ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విపక్షాలకు వలంటీర్ వ్యవస్థ కంటగింపుగా మారింది. ఈ నేపథ్యంలోనే తప్పుడు ప్రచారాలు మొదలయ్యాయని వలంటీర్లు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భయం పుట్టుకుంది..



వలంటీర్లను రెచ్చగొట్టి చిచ్చు పెట్టాలని చూస్తున్నారు. అందుకే ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు రాశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తున్న మాపై తప్పుడు రాతలు రాసి, మా ఐక్యతను విడదీయలేరు.
– నీలావతి, వలంటీర్, చిత్తూరు

దురుద్దేశంతోనే..



ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న మాపై తప్పుడు రాతలు రాసి మా నమ్మకాన్ని దెబ్బ కొట్టాలనే దురుద్దేశంతో ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయి. పక్క రాష్ట్రాలు సైతం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల పనితీరుపై ప్రశంసలు కురిపిస్తున్నాయి. కోవిడ్ సమయంలో వైరస్ సోకిన వారి ఇళ్లకు వెళ్లి మరీ మేము సేవ చేశాం. వలంటీర్ల సేవలతో ప్రభుత్వానికి, ప్రజల్లో మంచి పేరు వస్తుండడంతో చూడలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.
– వేదవతి, వలంటీర్, చిత్తూరు

సేవలపై విషం..



రాష్ట్రంలో విశిష్ట సేవలందిస్తున్న మాపై పచ్చమీడియా విషం కక్కడం సరికాదు. ప్రాణాలను లెక్క చేయకుండా కోవిడ్ సమయంలో ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి మాస్కులు, కరోనా బాధితులకు మందులు అందజేశాం. మా సేవలను ముఖ్యమంత్రి గుర్తించి ఏటా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరిస్తున్నారు. వలంటీర్లపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోం.
– తానీష్ బాషా, వలంటీర్, ఎస్ఆర్‌పురం

చిత్తశుద్ధితో పని చేస్తున్నాం..



ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేరవేసేందుకు ఎంతో దీర్ఘదృష్టితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. ఆ మేరకు మేము చిత్తశుద్ధితో సేవలందిస్తున్నాం. జనం కోసం పనిచేస్తున్న వ్యవస్థను నాశనం చేసేందుకు టీడీపీతో కలిసి పచ్చ మీడియా కుయుక్తులు పన్నుతోంది.
– ప్రసన్న, వలంటీర్, పూతలపట్టు

తలుపు తట్టి సేవలు అందించి..



వలంటీర్లు తలుపు తట్టి పింఛన్, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిని చేరవేస్తున్నారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా, దరఖాస్తు వారి చేతిలో పెడితే ఇంటివద్దకే తెచ్చిస్తున్నారు. అప్లికేషన్ రుసుం మాత్రమే తీసుకుంటున్నారు. లంచాలు ఇవ్వాల్సిన పనిలేదు. ఇప్పుడు వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయి. కానీ వారిపై ప్రతిపక్షాలు ఇలా విషం చిమ్మడం సరికాదు.
– శ్రీరాములు, గుడిపాల

వారి సేవలు అభినందనీయం...



కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రజలను అప్రమత్తం చేస్తూ వచ్చారు. పాజిటివ్ కేసులు నమోదైతే వెంటనే చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్య పనులు చేసి రోడ్లంతా బ్లీచింగ్ చల్లేవారు. వారానికి ఒకసారి వచ్చి ఇంట్లో జ్వరాలున్నాయా లేదా అడిగేవారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఫలాన్ని గడప దాటకుండా తెచ్చి ఇచ్చారు. గ్రామంలో ఇంకేమైనా సమస్యలు వస్తే కూడా వారే ముందుండి చేయిస్తున్నారు.
– ఆదెమ్మ, పూతలపట్టు

జీర్ణించుకోలేక..



తమకు కేటాయించిన 50 కుటుంబాల్లో బాధ్యతగా సేవలు చేస్తున్నాం. వాళ్ల అవసరమైన మేరకు పనులు చేసి పెడుతున్నాం. తమపై ఇచ్చిన నమ్మకానికి వమ్ము చేయకుండా పనిచేస్తున్నాం. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించారు. ప్రజలు కూడా మా వలంటీర్లను నమ్ముతున్నారు. ఈ నమ్మకాన్ని వమ్ము చేయాలని ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయి. వీటిని మేము నమ్మే పరిస్థితులు లేవు.
– వనిత, వలంటీర్, చిత్తూరు రూరల్

కిడ్నాప్ కేసులో నలుగురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మనోజ్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేసిన కేసులో నలుగురు నిందితులు అరెస్టు అయ్యారు. టూటౌన్ ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. చిత్తూరులోని అశోకపురం కాలనీకి చెందిన మనోజ్ అనే వ్యక్తికి, ధరణీష్ రెడ్డికి పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ధరణీష్, మరికొందరితో కలిసి మనోజ్‌ను కిడ్నాప్ చేశారు. ఈ విషయం ఎస్పీ రిషాంత్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాలతో ఎస్ఐ నాగరాజు సిబ్బందితో కలిసి నిందితులను వెంబడించారు. మనోజ్‌ను కిడ్నాపర్లు గంగాధర నెల్లూరు–బలిజకండ్రిగ దారిలో వదిలేసి పారిపోయారు. పోలీసులు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, దాడికి పాల్పడిన రాజేష్ విజయ్, మజాద్, జ్యోతిప్రకాష్ అనే నలుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న మరికొందరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


బాలాజీ(ఫైల్)

గంగవరం: కిలోమీటరు ప్రయాణం సజావుగా సాగి ఉంటే ఇంటికి వెళ్లి భార్య, పది రోజుల పసి బిడ్డను చూసి ఆనందంగా గడిపాల్సిన వ్యక్తిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఈ హృదయ విదారక సంఘటన గంగవరం మండలంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లి మండలం నాసుకుప్పానికి చెందిన బాలాజీ(29) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఇతనికి గంగవరం మండలం పొన్నమాకులపల్లికి చెందిన హేమావతితో ఏడాది కిందట పెళ్లి అయింది. అయితే హేమావతి పది రోజుల కిందట మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో బాలాజీ ఆఫీసులో సెలవు పెట్టి ఊరికి బుధవారం బెంగళూరు నుంచి బైక్‌లో ఊరికి బయలుదేరాడు. అయితే గొర్రెలదొడ్డి క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం అతని బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడాదిన్నరలోపే భర్త మరణించడంతో హేమావతి శోకసంద్రంలో మునిగిపోయింది.

పకడ్బందీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


పూతలపట్టు: పి.కొత్తకోట సచివాలయ పరిధిలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు


చిత్తూరు మెసానికల్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు

- 1120 మ్యాచ్‌ల నిర్వహణ
- పర్యవేక్షించిన కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాస్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా గురువారం (మూడవ రోజు) ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో 1120 మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలను కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. జిల్లావ్యాప్తంగా 484 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం గురువారం 1190 మ్యాచ్‌లను నిర్వహించాల్సి ఉండగా 1120 మ్యాచ్‌లను జరిపారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పోటాపోటీ తలబడ్డారు. ఈ పోటీల్లో 13,552 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అధికారులు వెల్లడించారు. ఈ పోటీల్లో ప్రజాప్రతినిధులు 1054 మంది, ప్రేక్షకులు 41,327 పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మృతి చెందిన ధన్య, మృతురాలి భర్త గౌతమ్

శ్రీరంగరాజపురం: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని మెదవాడ ఎస్సీ కాలనీ చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వెంకటాపురం దళితవాడకు చెందిన విజయ్‌కుమార్ కుమార్తె ధన్య(25) బెంగళూరు ఇందిరానగర్ కాలనీకి చెందిన గౌతమ్(32) ఐదేళ్ల కిందట వివాహమైంది. వీరి మండలంలోని మెదవాడ ఎస్సీ కాలనీలో సిమెంట్ బ్రిక్స్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం భార్యభర్త గొడవపడ్డారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మళ్లీ భార్యాభర్తలు గొడవపడి భార్య ధన్య ఇంటికి వెళ్లింది. అయితే ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో గౌతమ్ వెళ్లి చూడగా కిందపడి ఉంది. అతను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే ధన్య మరణించినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్కూల్ వ్యాన్- ఆటో ఢీ


గాయపడిన సల్మాన్

పుంగనూరు: కూలీ పనులకు ఆటోలో వెళ్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చి స్కూల్ వ్యాన్ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలైంది. గురువారం పెద్దపంజాణి మండలం భద్రచలానికి చెందిన అమీన(40), డ్రైవర్ అక్బర్ (25), సల్మాన్(13)తో పాటు మరి కొంతమంది కూలీ పనులకు రామసముద్రం మండలం మినికి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు ఆటో రాగా ఎదురుగా పుంగనూరు వైపు వస్తున్న ప్రైవేటు స్కూల్ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో అమీన, డ్రైవర్ అక్బర్, సల్మాన్‌కు తీవ్ర రక్త గాయాలైంది. వెంటనే స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ నౌ జవాన్ కమిటీ అంబులెన్స్‌లో క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న జ్యోతిరావు పూలే భవనంలో ఆడుదాం ఆంధ్ర కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం కంట్రోల్ రూం ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించేలా పర్యవేక్షించేందుకు కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో కేటాయించిన షెడ్యూల్ ప్రకారం క్రీడాపోటీలు నిర్వహించాలన్నారు. పోటీలు ప్రారంభమైన వెంటనే ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పోటీల ఫలితాలను కాల్‌సెంటర్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు. ఈ కంట్రోల్ రూంకు డీఎల్‌డీఓ రవికుమార్, వయోజన విద్యాశాఖ అధికారి నాగేశ్వరరెడ్డిని మానిటరింగ్ అధికారులుగా నియమించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వేరియంట్‌పై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు రూరల్: కొత్త వేరియంట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, డీఐఓ రవిరాజు అన్నారు. చిత్తూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొత్త వేరియంట్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ మాస్కులు ధరించాలన్నారు. భౌతికదూరం పాటించడంతో పాటు చేతుల శుభ్రత పాటించాలన్నారు. ఆస్పత్రుల్లో కూడా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

200 మొబైల్ ఫోన్ల అందజేత

- చాట్‌బూట్‌తో మిస్సింగ్ మొబైల్స్ పట్టివేత
- రూ.45 లక్షలు విలువజేసే ఫోన్ల రికవరీ
- క్రైమ్ సీఐ భాస్కర్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ భాస్కర్

చిత్తూరు అర్బన్: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు తిరిగి వాటిని అందజేసినట్లు క్రైమ్ సీఐ భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన నగరంలోని క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివిధ కారణాలతో చాలామంది ఫోన్లను పోగొట్టుకుని, ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి చాట్‌బూట్ సాయపడుతోందన్నారు. మొబైల్ ట్రాకింగ్ బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయిస్తోందన్నారు. ఇప్పుడు రూ.45 లక్షలు విలువ చేసే 200 మొబైల్ ఫోన్లను రికవరీ చేసిందన్నారు. వీటిని ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, జమ్ము, కాశ్మీర్ రాజస్థాన్, బిహార్, కేరళ రాష్ట్రాల్లో కూడా రికవరీ చేయిస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్నవాటిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు. మొబైల్ వివరాలు అందజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు క్రైమ్ విభాగం పోలీసులు కృషి చేస్తారన్నారు. ఇప్పటివరకు నాలుగు దశల్లో సుమారు రూ.2.50 కోట్ల విలువ చేసే 1200 ఫోన్లను రికవరీ చేసినట్లు ఆయన వెల్లడించారు. పట్టుబడిన ఫోన్లను ఇతర రాష్ట్రాల్లో ఉంటే వారికి కొరియర్ ద్వారా బాధితుల ఇళ్లకే చేరుస్తామన్నారు. ఫోన్ పోగొట్టుకున్న వారు 9440900004 వాట్సాప్‌కు మెసేజ్ చేస్తే చాలన్నారు. కేసు ఛేదనలో చాట్‌బూట్ ద్వారా ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పనితీరును అభినందించారు.

త్వరలోనే నూతన భవనాలు ప్రారంభం

- ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి


ఆలయ అభివృద్ధిపై సభ్యులతో చర్చిస్తున్న చైర్మన్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి సంబంధించి నూతనంగా నిర్మించిన పలు భవనాలను జనవరిలో ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ఆలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన పాలక మండలి సమావేశం నిర్వహించారు. అలాగే భక్తుల సౌకర్యార్థం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధి పనులపై సభ్యులతో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి లడ్డూ పోటు భవనం పూర్తి అయిందన్నారు. అలాగే గణేష్ సదన్‌లో వంద గదులు అదనంగా నిర్మించామన్నారు. వాటిని జనవరిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే వంద అడుగుల రహదారి వద్ద స్వామివారి ఆర్చి, పార్క్ తదితర వాటిని ప్రారంభిస్తామన్నారు.

న్యూఇయర్ రోజు ప్రత్యేక ఏర్పాట్లు ..

ఆంగ్ల నూతన సంవత్సరం జనవరి 1వ తేదీన స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వీఐపీలకు ప్రత్యేక సమయం కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు నరసింహులు శెట్టి, గోవర్ధన్, రవీంద్రుడు, కాంతమ్మ, సుబ్బలక్ష్మమ్మ, జయశ్రీ, వెంకటరమణ, రామసుబ్బమ్మ, సోమశేఖర్ గురుకుల్, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు పాల్గొన్నారు.

పీటీసీలో సైబర్ నేరాలపై వర్క్‌షాప్

చంద్రగిరి: కల్యాణి డ్యాం సమీపంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల(పీటీసీ)లో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్రిప్టో కరెన్సీ సంబంధిత సైబర్ నేరాల విచారణపై గురువారం ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. పీటీసీ ప్రిన్సిపల్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సమన్వయంతో క్రిప్టోకరెన్సీ నేరాలకు సంబంధించిన కేసులను విజయవంతంగా పరిశోధించనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ స్థాయికి చెందిన 40 మంది అధికారులు ఈ శిక్షణకు హాజరయ్యారు.